కథానిక

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1997 దీపావళి ప్రత్యేక సంచిక

# మొగ్గ

శారదా అశోకవర్ధన్

చిన్నారి కొడుకు ముందు ఆ తల్లి ఎందుకు ఏడ్చింది

జూబిలీహిల్స్ కొండలమీద, హైదరాబాద్ నగరంలో పదిగదుల విశాలమైన బంగ్లా అది. ఇల్లు చూస్తేనే ఇంట్లో వారి హోదా తెలిసిపోతుంది. అది ప్రఖ్యాత వ్యాపారవేత్త గంగిరెడ్డి గారిల్లు! ఇంటి చుట్టూ అమర్చిన దీపాల కాంతిలో తాజ్‌మహల్‌లాగా దేదీప్యమానంగా వెలిగిపోతుంది ఆ ఇల్లు ఆరోజున. అత్యాధునికమైన కట్టడి. లేత క్రీం రంగు డిస్‌టెంపర్ గోడల మధ్య, అక్కడక్కడా వేసిన పాచిరంగు గ్రీన్‌కలరు డిజైన్లు. ఆ దీపాల వెలుగులో పచ్చ గడ్డి పరిచినట్టు మెరిసిపోతూ వున్నాయి. ఎరువు,నీలం, ఆకుపచ్చ, బల్బులు, వెలుగుతూ ఆరిపోతూ మిణుకుమిణుకుమనే నక్షత్రాల్లా అగుపిస్తూ, చూసేవారి కది ఒక చిన్న తారామండలంలా అనిపిస్తోంది. ఇంటిముందు షామియానా. షామియానాలో గజానికొక బలుబు, ట్యూబ్‌లైట్‌లు అమర్చి పెట్టారు. ఆ వెలుగులో వెన్నెలకూడా వెలవెల బోతోంది. చూస్తూ వుండగానే రంగురంగల కార్లు ముచ్చటగా ముద్దుగాలిపై చిన్న సైజువీ, పొడుగ్గా పడవల్లాగా కనిపించేవి ఎన్నో కార్లు, రకరకాల స్కూటర్లు,మోటారు సైకిళ్ళు ఎన్నో.. ఎన్నెన్నో! ఆశ్చర్యంతో చూస్తూ వాటిని లెక్క పెట్టాలని చూసినా చాతకాక పక్కనే నుంచి అలా వాటికేసి కాస్సేపు ఇంట్లో జరుగుతున్న కార్యక్రమాల హడావిడి కేసి కాస్సేపు చూస్తూ నుంచున్నాడు పెంటయ్య. రోజూ చూసే ఇల్లే... రోజూ చూస్తున్న మనుషులే..! అయినా ఈరోజు ఆ ఇల్లు.. ఆ మనుషులు అంతా కొత్తగానే కనిపిస్తున్నారు పెంటయ్యకి! జారిపోతున్న లాగు (నిక్కర్లి) పైకి లాక్కుంటూ ఒదులుగా వున్న, వాడికి బుద్ధి తెలిసాక వేసుకున్న కొత్త డ్రెస్‌కనుక విసుక్కోకుండా పైకి లాక్కుంటూ దూరంగా నిలబడి చూస్తున్నాడు వేడుకలని పెంటయ్య. అది ఆ ఇంట్లోని చిన్నారి ఫాల్గుణి ప్రథమ పుట్టినరోజు పండుగ!

ధగధగా మెరుస్తున్న వెండి కుర్చిలో, మందారం రంగులో గొడుగులా విచ్చుకుని, జరీపువ్వల తళతళలతో మెరిసిపోతూ ఎంతో అందంగా వున్న గౌను వేసుకుని, తెల్లటి సాక్సు, తెల్లటి షూసు వేసుకుని ఆ షూసు, ఆ పాప ఆడుగువేసినప్పుడల్లా లైటులాంటి కాంతి నిస్తూ వుంటే, సంగీతం లాంటి శబ్దం వినిపిస్తుంటే కుర్చీ దిగుతూ ఎక్కుతూ ఆడుకుంటోంది ఫాల్గుణి! చేతులకి బంగారు మురుగులు, మెడలో రకరకాల గొలుసులూ ఫాల్గుణి తెల్లటి శరీరచ్ఛాయకి పసుపురంగు వన్నె రంగరించినట్టు కాంతినిస్తున్నాయి! అవన్నీ చిరాగ్గా వున్నాయేమో మధ్య మధ్య పీకేస్తోంది ఫాల్గుణి. వెంటనే వాళ్ళమ్మ శ్రావ్యా, అమ్మమ్మా కాంచనా వెళ్ళి వాటిని మళ్ళీ సరిగ్గా సర్దుతున్నారు. పెంటయ్య తన బట్టలకేసి చూసుకున్నాడు.పేలికల్లా వెలవెల బోతున్నాయి. జారిపోతున్న లాగుని మళ్ళీ పైకి లాక్కున్నాడు. లాగు కనిపించినంత పొడుగ్గా షర్టుని చూసి కొంచెం మడత పెట్టి పట్టుకోవడానికి ప్రయత్నించి విఫలుడయ్యాడు. అది కొంటున్నప్పుడే చెప్పాడు తల్లికి.


'ఇవి చాలా పెద్దగున్నాయమ్మ. కొంచెం చిన్న సైజు కొనమని'. కానీ నర్సమ్మ వింటే కదా! 'ఎదిగే పిల్లోడికి కరెట్టు సైజు కొంటే ఎల్లియ పొట్టిగయిపోతది. పెద్దసైజు కొంటే కనీసం కొన్నాద్దులు తొడుగుకోవచ్చు.' అంటూ ముదురు నీలంరంగు లాగూ ఆదేరంగు గళ్ళచొక్కా కొంది. అదైతే మురికి ఆగుతుందని. ఆ టైములో నర్సమ్మ స్నానం చేయించి బట్టలు తొడుగుతుంటే పెంటయ్యకి ఎంత సంతోషం వేసిందో! కిటికీ గూట్లో పెట్టిన సగం పగిలిన అద్దంలో వాడి మొహం ఎన్నిసార్లు చూసుకున్నాడో! తలకి బాగా నూనె రాసి నున్నగా దువ్వుకున్న మొహం. గుండ్రంగా ఎంతో బాగా అనిపించింది వాడికి. రోజూ వాడికి వాళ్ళమ్మ అలా తల దువ్వాలనీ, నీళ్ళు పొయ్యాలనీ, ముద్దు పెట్టుకోవాలని అనిపిస్తుంది. కానీ టైమేది? రోజూ నర్సమ్మ నాలుగింటికి లేస్తుంది. ఇంటిముందు నీళ్ళు జల్లి ముగ్గుపెడుతోంది. ఆ తరువాత చల్లనీళ్ళే నాలుగు చెంబులు స్నానం చేస్తుంది. చాయ్‌పెడుతుంది. అప్పుడు 'పెంటీ.. పెంటీ.. లేగా. లేటయితది. మనం బోవాల..' అంటూ పెంటయ్యని నిద్రలేపడం మొదలు పెడుతుంటే లేపగా లేపగా ఒక గంటకి మెల్లగా లేస్తాడు వాడు. నూరిపెట్టి తయారుగా వుంచిన బొగ్గుపొడిని చేతికందిస్తుంది తల్లి. పళ్ళు తోముకుని ముఖాన్నీ నీళ్ళతో కడుక్కుని, తల్లి అందించిన చాయ్ గ్లాస్ తీసుకుని తాగే లోగానే తల్లి పదిసార్లు చెబుతుంది' బిరాన పో బిడ్డా! అమ్మ కోపమైతది' అంటూ వెంటనే వెళ్ళిపోతాడు. వాడు పరుగులాంటి నడకతో. అయ్యగారి కారు తుడవడం దగ్గరి నుంచి, చెట్లకి నీళ్ళు పొయ్యడం, బజారుకెళ్ళి ఏది తెమ్మంటే అది తేవడం, ఫాల్గుణిని ఎత్తుకు తిప్పడం, అన్ని పన్లు ఏది చెబితే అది చెయ్యాలి. పది గంటలకు అమ్మగారు వంటామెకి చెప్పి టిఫిన్ పెట్టిస్తారు. వంటామె ఆమెకి నచ్చినంత కొసరి కొసరి పెడతుంది. అసలు పెట్టాలా వద్దా అని ఆలోచిస్తున్నట్టు. తన సొమ్మేదో పోతున్నట్టు! మళ్ళీ ఎన్నో పన్లు! కనపడడానికి చెప్పడానికి రాని పన్లు. అయ్యగారి షర్టు, ప్యాంట్లు. ఇంకేమైనా అమ్మగారి బట్టలు సందు చివర వున్న చాకలి కొట్లో ఇవ్వడానికి, ఇచ్చినవి తేవడానికి, ఇంటికెవరైనా వొచ్చినా లేదా ఇంట్లో వాళ్ళకైనా కాఫీలు, టీలు, అందించడానికి, కప్పులు కడగడానికి, దుప్పట్లు వెయ్యడానికి, ఇలా ఎన్నిసార్లు తిరుగుతాడో, ఇంట్లో ఇంట్లోనే ఎవరూ లెక్కపెట్టలేదు. మధ్యాహ్నం అందరి భోజనాలు అయ్యాక వంటావిడ వెంకటలక్ష్మి పెంటయ్యకి, నర్సమ్మకి కలిపి అన్నం చారు, మిగిలినవేవో గిన్నెల్లో పెట్టి ఇస్తుంది. తోటలో ఒక మూల విస్తరాకుల్లో పెట్టుకుని నర్సమ్మ, పెంటయ్య ఇద్దరూ తింటారు. తినేలోగానే అమ్మగారో, అయ్యగారో పిలుస్తూనే వుంటారు. 'జల్ది, జల్ది తినిపో' అని తొందర చేస్తుంది నర్సమ్మ. కాస్త ఆలస్యం అయితే అందరిదగ్గరా తిట్లే 'దున్నపోతులా గంటసేపు తింటావేంటే' అంటూ.

ఇద్దరూ పిల్లలే కానీ వాళ్ళిద్దరి మధ్య తేడా ఎంత

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1997 దీపావళి ప్రత్యేక సంచిక

రోజూ తన తల్లి ఫాల్గుణికి వెండి కంచంలో ముద్దలు కలిపి చెట్టుని చూపిస్తూ గంటసేపు తిప్పి తిప్పి తినిపిస్తూ వుంటే వాడికెంతో ముచ్చటగా వుంటే ఆటే చూస్తూ వుంటాడస వాడు అలా చూస్తూ వుంటే తన్మయత్వంతో ఫాల్గుణి స్థానంలో తనని ఊహించుకుంటూ అమ్మగారు కోప్పడ్తారు కూడా.

'నీకు కడుపు నిండా టిఫిను, తిండీ పెట్టినా దాని కంచం వైపు అలా చూస్తావేమిట్రా. దిష్టి తగిలేట్టు' అంటూ పెద్ద



ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1997 దీపావళి ప్రత్యేక సంచిక

**తల్లి బానిసత్వానికి కొడుకు ఎలా విముక్తిని ప్రసాదించాలనుకున్నాడు**

మ్మగారు కాంచనమ్మగారి తిట్లు! 'లేకి తనం, లేకి బుద్ధి... అమ్మగోరు శ్రావ్య మ్మగోరి మాటలు. 'వాడంతేనండి' ఎంత పెట్టినా చాలదు వాడికి. అబ!' అంటూ వంటింట్లోంచి వెంకటలక్ష్మి వంట మనిషి వంతపాట! ఆవిడ వంటింట్లో కూర్చుని మెక్కడం ఎన్నోసార్లు చూశాడు పెంటయ్య. కానీ ఎవరికీ చెప్పలేదు ఒక్క తల్లికి తప్ప! 'ఏయ్.. ఊరుకో బిడ్డా. మనకెందుకు? యాడ వన్నవోరిప్పితివా మన పానాలు దీస్తరు అల్లు! పెద్దోల్ల సంగతి!.. ఏమనబోకు బిడ్డ!... ఎవ్వరి తెరువు కాబోకు నువ్వు' అంటూ సలహా ఇచ్చేది నర్సమ్మ.

ఆరోజు అమ్మగోరు తన తల్లికి డబ్బించి 'ఒసేయ్. పెంటికి కొత్తబట్టలు కొనవే' అన్న ప్పుడు మురిసిపోయాడు వాడు. తల్లితో మార్కెట్‌కెళ్ళి చొక్కా, లాగు కొనుక్కుని ఇంకా మురిసిపోయాడు. ఆ సాయంత్రం బట్టలు వేసుకుంటూ ముస్తాబవుతుంటే తల్లి ఫాల్గుణిని ముస్తాబు చేస్తున్నట్టుగా పొంగిపోయాడు.

దూరం నుంచి ఫాల్గుణి కేక్ కట్ చెయ్యడం, బెలూన్లలోను, బూరాలతోను ఆడుకుంటున్న ఇతర పిల్లలని చూస్తూ, తనకీ ఆడుకోవాలని పించినా, తనకెవ్వరూ ఇవ్వలేదు కాబట్టి మాట్లాడక ఊరుకు న్నాడు. కానీ కళ్ళారా చూడడానికి కూడా నోచుకోలేనట్టు అమ్మగోరు, పెద్దమ్మగోరు ఊరిగే వాణ్ణి పిలిచి అందరికీ కేక్ ముక్కలు, టిఫిన్లు అందించమనడం, మంచినీళ్ళు, కాఫీలు అందించమనడం, ఖాళీ కప్పులు తెచ్చి కడగమనడం, ఆ సమయంలో పెంటికి అవన్నీ చెయ్యాలని అనిపిం చక పోవడంతో అయిష్టంగానే అన్ని పన్లు చేస్తున్నాడు. వాడి కొత్త బట్టలు నలిగి పోయాయని, కాఫీ ఒలికి వాడి చొక్కా మీద పడితే, వాడి చొక్కా పాడయిందని వాడు బాధపడుతూ వుంటే, కాఫీ ఒలక బోసి నందుకు అమ్మగోరు తిట్టడం, వాడికి ఏడుపొచ్చింది! అందరూ కేకు ముక్కల్ని మరీమరీ తింటూ వుంటే, వాడికి నోట్లో నీళ్ళూరాయి! అన్నీ దిగమింగుకుని, ఏదో లోకంలో వున్నట్టు, వింతగా చూస్తూ పన్లు చేసుకు పోతున్నాడు పెంటి.

ఉన్నట్టుండి పరుగెత్తికొచ్చి పెంటి కాళ్ళని చుట్టేసి ఎత్తుకోమని చేతులందించింది ఫాల్గుణి! ఆ కదలికకు తూలి పడ్డాడు పెంటి. వాడి చేతుల్లోని కేకు ముక్కలు స్వీట్లు వున్న ప్లేట్లు కిందపడి బద్దల య్యాయి. ఆ చప్పుడుకి ఝడుసుకుందేమో ఫాల్గుణి ఏడుపు లంకించుకుంది. అది చూసి అందరూ అటు పరుగెత్తుకొచ్చారు. శ్రావ్యకి పిచ్చికోపం వచ్చింది. 'వెధవా! ప్లేట్లన్నీ అలా పగులకొట్టేస్తావా' అంటూ వాణ్ణి లోపలి గదిలోకి తీసుకెళ్ళి ఆ చెంపా ఈ చెంపా వాయించింది. కాంచనగారు వాడి నిర్లక్ష్యాన్ని గురించి, అసమర్థతను గురించి పాఠాలు వల్లించి వేసింది.

పెంటి కళ్ళ నుంచి చెంపల మీదుగా జారిన కన్నీళ్ళు వాడి షర్టును తడిపేశాయి. అవమానం వాడిని అక్కడ నిలువనీ యడం లేదు. ఈ దృశ్యాన్ని చూస్తూ అవాక్కయిపోయింది నర్సమ్మ. పెంటిని ఎత్తుకుని గుండెలకు హత్తుకుని ఓదా ర్చాలని పించింది. కానీ బోలెడు పన్లు. అందరూ ఏదో ఒకటి చెప్తూ పిలుస్తున్నారు.

'నర్సమ్మా.. మంచినీళ్ళు కావాలి'.

'నర్సమ్మా... టీ కప్పులు పట్టుకెళ్ళు'

'నర్సమ్మా.. ఈ కుర్చీ అక్కడ వెయ్యి'

**బతుకులో నైజాల వెనక వ్యవస్థ స్వరూపం ఏమిటి?**

ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1997 దీపావళి ప్రత్యేక సంచిక

నర్సమ్మకి ఊపిరి ఆడడం లేదు.

ఏడుస్తున్న పెంటిమీదె తన ధ్యాస! కానీ ఒదిలేసి వాణ్ణి దగ్గరకు చేరదీసు స్వేచ్ఛ తనకి లేదు! తను అక్కడున్న వాళ్ళందరికీ బానిస! ఆమె గుండె, పెంటి దుఃఖాన్ని చూసి బద్దలయిపోతుంది. అక్కడున్న వాళ్ళందరూ కేకు ముక్కలు స్వీట్లు తింటూ వుంటే, తన కొడుకు అవేవీ తినక పోగా, దెబ్బలు తిన్నాడు. ఆమె కళ్ళు నీటి కుండలయ్యాయి. పమిట కొంగుతో కళ్ళు తుడుచుకుంది.

ఎక్కడి వాళ్ళక్కడికి వెళ్ళే సరికి రాత్రి పదిగంటలు దాటింది. ఏడ్చి ఏడ్చి పెంటి ఆ మూల కూర్చునే నిద్రపోయాడు! పెద్ద కేకుని ముక్కలు కోస్తున్నట్టు కలగంటూ, చిన్నగా నవ్వుకుంటున్నాడు. శ్రావ్య ఇచ్చిన కేకుముక్కలో స్వీట్లు తీసుకుని, పెంటిని నిద్రలేపి ఇంటికి బయలుదేరింది నర్సమ్మ.


పెంటిని ఒళ్ళోఓ కూర్చోబెట్టుకుని 'ఇగో ఈకేకు ముక్క తిను బిడ్డా' అని నోట్లో పెట్టింది. తుపుక్కున ఉమ్మేశాడు పెంటి! కొన్ని గంటల క్రితం ఆ కేకు ముక్కల్ని ఎంతో కోరుకుని దాని కోసం విలవిల లాడిపోయిన వాడికి, ఇప్పడది నోట్లోకి పోవడం లేదు. వాచి పోయిన బుగ్గలని తల్లి మెల్లిగా నిమురుతూ వుంటే అది కేకు ముక్కలకన్నా తియ్యగా అనిపించింది.

'అమ్మా! నేనొక టడుగుతా... ఒద్దనవు గద!' అన్నాడు.

కళ్ళలోని నీటి తెరలను పమిట చెంగుతో తుడుచుకుంటూ 'అడుగు బిడ్డా.. ఏంగావాలె నీకు?' ముద్దుల వర్షం కురిపించింది వాడి నుదుటిమీద. గట్టిగా గుండెకి వాణ్ణి హత్తుకుంటూ. ఆ పరిష్వంగంలోని హాయిలో తేలిపోతూ 'అమ్మ! రేపటి నుండి నేను బడికి పోతనే! పనికి బోను! సదువుకుంటా.! కాదనకే!' అన్నాడు జాలిగా చూస్తూ.

నర్సమ్మలోని మాతృత్వం కొవ్వొత్తిలా కరిగిపోయింది. కన్నీరు కాలువలై పొంగింది. సెంద్రయ్య మాటలు గుర్తుకొచ్చాయి. 'నర్సీ.. నాగ్గిట్ట కొడుకు బుడితే అణ్ణి నాలెక్క లారీ డ్రైవర్ని సెయ్యనే.. నీ..యవ్వ!.. ఇస్కూడుకి బంపించి, దొర్ల లెక్క సదివిపిస్తా' అని! కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. యాక్సిడెంట్‌లో చనిపోయిన చంద్రయ్య గుర్తుకొచ్చి! నర్సమ్మ వాణ్ణి ఆట్టాగే బిడ్డా! రేపు పొద్దుగల మూలమలు వుకాడున్న బడికి పోయి పెద్ద పంతుల్ని కలిసి నిన్ను ఇస్కూల్లో ఏస్తా! నువ్వయ బుగులుపడకు' అంది బలవంతంగా కేకు ముక్కల్ని తినిపిస్తూ!

ఆ మాటలు, ఆ కంఠస్వరం వాడికి కోటి వీణలు మోగినట్టనిపించింది. ఆమె పొత్తిళ్ళలోని వెచ్చదనం, మెత్తదనం, వంద పరుపులకు సరితూగదనిపించింది! ఆ వొళ్ళో హాయిగా ఆదమరిచి నిద్రపోయేడు పెంటి! మర్నాడు వెళ్ళబోయే స్కూలు జీవితం గురించి కమ్మగా ఊహించుకుంటూ కలలు కంటున్నాడు. తల్లి ఒళ్ళో మొగ్గలా ముడుచుకుపోయి పడుకుంటూ! 'రేపు ఈ మొగ్గ వికసించి పువ్వవుతుంది. ఆ ఆనందంలో తనకి స్వేచ్ఛ లభిస్తుంది' నర్సమ్మ కూడా ఊహల్లో తేలిపోతూ. వాణ్ణి పక్కమీద పడుకోబెట్టి, గుండెలకు హత్తుకుంటూ నిద్రలో మైమరచి పోయింది!



ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక 1997 దీపావళి ప్రత్యేక సంచిక

# జ్ఞాని

–దిలీప్

ముక్కుపచ్చలారని
ముచ్చటైనవాడు.
తల్లికొంగు కొస
వేళ్ళలో వున్నవాడు.
కులమంటే తెలియనివాడు
మతమంటే విననివాడు.
అబద్ధం ఊపిరిలోనే లేదు
ద్వేషం రక్తంలోకి ఎక్కలేదు.
కుటిల కుతంత్రాలను గురించి



అతనికెవరైనా శిక్షణ ఇవ్వాల్సిందే.
రంగురంగుల పూలను
ఒకే పరిమళంతో ప్రేమిస్తాడు
స్వచ్ఛస్ఫటికంలా నవ్వేస్తాడు
అమాయకంగా హాయిగా ఏడుస్తాడు.
ఇతన్ని పాడుచేద్దామా?
చేతులు కాలుతాయేమో!
ఎందుకంటే
ఇతడు
జ్ఞాని!